క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు రిక్షాలు అందజేత



పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ రిక్షాలను అందించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులకు రెండు రిక్షాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, కార్యదర్శి అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి శ్రీమన్నారాయణుడి అధ్యయనోత్సవాలు



కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెంలో గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణకర్త అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ శుక్రవారం తెలిపారు. 20 నుంచి 25 వరకు ఉత్సవాలు జరుగుతాయని, రోజూ స్వామివారి ఉత్సవ మూర్తులకు అభిషేకాలు జరుగుతాయని చెప్పారు. శ్రీమన్నారాయణుడితో పాటు రామానుజాచార్యులు, నమ్మాళ్లర్లకు ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు. ఉత్సవ మూర్తులకు వాహన సేవలను జరపనున్నట్లు అష్టాక్షరీ స్వామిజీ చెప్పారు. భక్తమండళ్ల సభ్యులతో కోలాట భజనలు, నగర సంకీర్తన నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.75,116 విరాళం



మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి హైదరాబాద్ వాస్తవ్యులు బి.సందీప్ దంపతులు రూ. 75,116 విరాళంగా అందజేశారు. శుక్రవారం స్వామివార్లను దర్శించుకున్న అనంతరం ఆలయ ఉపకమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు విరాళాన్ని ఇచ్చారు. దాత సందీప్ దంపతులను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

60 మందికి దుప్పట్ల పంపిణీ



నాగాయలంక: మండల శ్రీకృష్ణ దేవరాయ శ్రీకనకదుర్గమ్మ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణ దేవరాయ జయంతి పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నాగాయలంక మండలం పర్రచివర, దిండి గ్రామాల్లో గుర్తించిన 60మంది గిరిజన యానాదులకు చలికాలం నేపథ్యంలో రూ.10 వేల విలువైన దుప్పట్లు అందజేశారు. సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్(చిన్నారి) సౌజన్యంతో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, గణపేశ్వరం ఎంపీటీసీ సభ్యుడు బర్మా శ్రీనివాసరావు, నీటిసంఘం అధ్యక్షుడు కారంకి కృష్ణ పంపిణీ చేశారు. మండలి బాజీ, విజయ్, కారంకి ప్రసాద్, గంగయ్య, పులి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: షాలోమ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో 20 మంది వికలాంగులకు ఎస్ఐ శ్రీనివాస్ చేతులమీదుగా స్థానిక వంతెన సెంటర్‌లో శుక్రవారం రగ్గులు పంపిణీ చేశారు.

బళ్లు, ఒళ్లు హూనం



కొడాలి(ఘంటసాల): సంక్రాంతిలోపు రోడ్లపై గుంతలన్నీ పూడ్చివేస్తామని ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఘంటసాల మండలం కొడాలి నుంచి శ్రీకాకుళం వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చడానికి తవ్వి వదిలేయడంతో రాళ్లు తేలాయి. దీంతో ద్విచక్ర వాహనచోదకులు, నాలుగు చక్రాల వాహన యజమానులు ఇక్కట్లు పడాల్సి వస్తోంది. శుక్రవారం సాయంత్రం కొడాలి వైపు నుంచి విజయవాడ వెళ్తున్న ఓ కారు ముందు చక్రం ఊడిపోవడంతో దానిలో ప్రయాణిస్తున్న వారు మరో కారులో విజయవాడ వెళ్లినట్లు అక్కడున్న వారు తెలిపారు. ఈ రోడ్డు అసంపూర్తిగా వదిలేయడంతో ఇబ్బందికి గురైనట్లు డ్రైవర్ తెలిపారు.

'ఇంటి' లెక్కలపై దృష్టి!

- పన్నులు కట్టని ఇళ్ల సంఖ్య అధికమే
- ట్యాక్స్ వేయకుండా తాత్సారం
- ఆదాయం కోల్పోతున్న పెడన పురపాలక సంఘం



పెడనలో దక్షిణ తెలుగుపాలెం కాలనీలో ఇంటి పన్నులను పరిశీలిస్తున్న సచివాలయ ఉద్యోగి

పెడన: పన్నులు కట్టని ఇళ్లపై పురపాలక సంఘం ప్రత్యేక దృష్టి పెట్టింది. పట్టణంలో పురపాలక సంఘ అధికారుల గణాంకాల ప్రకారం 8,486 గృహాలున్నట్లు నివేదికలున్నాయి. వీటిలో పన్నులు కడుతున్న ఇళ్లు మాత్రం వాస్తవ సంఖ్య కంటే తక్కువగానే ఉండటం విశేషం. అధికారుల నుంచే కాకుండా పట్టణ వాసులు కూడా ఇళ్లు పురపాలక లెక్కలు కంటే ఎక్కువగానే ఉన్నాయననే అంటున్నారు. 2008లో ఏర్పడిన కాలనీలకు కూడా ఇప్పటి వరకు పన్నులు వేయలేదంటే పురపాలక అధికారులు ఏ స్థాయిలో పనిచేస్తున్నారో అర్థమవుతుంది. 2008 నుంచి కూడా ఇప్పటి వరకు పట్టణంలో చాలా కాలనీలు ఏర్పడ్డాయి. వీటిలో చాలా ఇళ్లను నిర్మించారు. ఇక్కడ కాలనీల్లో సుమారు 4 వేలకు పైగా ఇళ్లు ఉన్నాయి. ప్రభుత్వ కాలనీల్లో ఎవరికైతే ఇంటి స్థలాన్ని కేటాయించారో వారు ఉంటే మాత్రం పన్ను వేశారు. స్థలాన్ని అమ్మేసి ఇళ్లు కట్టుకున్న ఇతరులకు, ఇంటిని నిర్మించి అమ్మేసిన వారికి పన్నులు వేయకుండా మున్సిపల్ అధికారులు మిన్నకుండి పోయారు. ఇలాంటి ఇళ్లు పట్టణంలో వెయ్యి నుంచి 2వేల వరకు ఉండవచ్చుననే అధికారిక నోటి లెక్కలు.

2008లో ఏర్పడిన కాలనీల నుంచి..

పట్టణంలో 2008లో ఏర్పడిన దక్షిణ తెలుగుపాలెంలోని కాలనీలో ఇప్పటి వరకు పన్నులు వేయని గృహాలు సుమారు 70 వరకు ఉండొచ్చని అధికారిక లెక్కలు. మెట్ల పూర్ణచంద్రరావు కాలనీ, పైడమ్మ కాలనీ, హనుమాన్ కాలనీ, వైఎస్సార్ కాలనీ ఇలా చాలా కాలనీల్లో ఇళ్లకు పన్నులు వేయలేదు. ఇటీవల కొందరు మంచినీటి కుళాయికి దరఖాస్తులు చేయడంతో ఆ ఇంటి పన్నులు బకాయి ఉన్నాయేమో అని పరిశీలిస్తే ఆ ఇంటి పేరుతో ఎటువంటి పన్నులు చెల్లించని విషయం బయటకు వచ్చింది. దీన్ని గోప్యంగా ఉంచడమే కాకుండా పట్టణంలో పన్నులు వేయని ఇళ్లు ఎన్ని ఉంటాయో పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ గోపాలరావు ఆదేశించినట్లు సమాచారం.

దీంతో సచివాలయ ఉద్యోగులు వారి వారి పరిధిలో సర్వే చేస్తూ డాక్యుమెంట్లు అన్నీ సక్రమంగా ఉన్న వాటికి పన్నులు వేయడం ప్రారంభించారు.

మున్సిపల్ ఆదాయం పెంచుతాం



కొన్నేళ్లుగా పన్నులు కట్టని ఇళ్లు ఉన్నట్లు నా దృష్టికి వచ్చింది. మరోసారి వెళ్లి డాక్యుమెంట్లు పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించాం. దీంతో పట్టణంలోని తొమ్మిది సచివాలయాల పరిధుల్లో కూడా పన్నులు వేయని ఇళ్లను గుర్తించే పనిలో సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతం నివసిస్తున్న, స్థలమున్న వారు వేరు కావడంతో దీనిపై రెవెన్యూ అధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుని మున్సిపల్ ఆదాయం పెంచడానికి కృషి చేస్తాం.

-ఎం.గోపాలరావు, మున్సిపల్ కమిషనర్, పెడన

లేఔట్ల బాధ్యత మున్సిపాలిటీదే

టీపీవో సుజనాకుమారి



ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్షిస్తున్న టీపీవో సుజనాకుమారి

పెడన: పట్టణంలో లేఔట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి వాటి యాజమానులు, అక్కడ వాస్తవ పరిస్థితులు సేకరించాలని పట్టణ ప్రణాళిక అధికారి సుజనాకుమారి అన్నారు. శుక్రవారం ఉదయం ఆమె కమిషనర్ చాంబరులో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లతో పాటు ప్లానింగ్ కార్యదర్శులతో పట్టణ ప్రణాళిక విభాగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంలో ముడా పరిధిలో లేఔట్ల అనుమతులుండేవని, ప్రస్తుతం ఆ బాధ్యతలను పురపాలక సంఘాలకు అప్పగిస్తూ ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యంలో ఆ లేఔట్ల స్థితిగతులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నతాధికారులు సమాచారం అడిగితే తక్షణం వారికి తెలియజేయాల్సి ఉందని మీ పరిధిలో లే ఔట్ల వివరాలతో పాటు ఆక్రమణలు, నూతన భవనాల దరఖాస్తులు, పట్టణ ప్రణాళికకు సంబంధించిన పూర్తి సమాచారం సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పామర్తి జితేంద్ర, బండి కిరణ్, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకనీడు కుటుంబ సభ్యుల సౌజన్యంతో నాగాయలంకలోని మారుతీ విద్యా నికేతన్ డిజటల్ స్కూలు ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్‌లు (ఐఓఎల్) శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

మినుము పైరులో తెగుళ్లపై అప్రమత్తం



కృత్తివెన్ను: మినుము పైరులో తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో జెన్నీ అన్నారు. మండలంలోని యండపల్లి, చెరుకుమిల్లి గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో మినుము పైరులో బూడిద, కండం గజ్జి తెగుళ్లు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. బూడిద తెగులు నివారణకు ఎకరాకు కాంటాఫ్ 2 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలపి, కండం గజ్జి తెగులుకు రిడామిల్ 2 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆమె రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు, అగ్రికల్చరల్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): పలు గ్రామాల్లో మినుము సాగును వ్యవసాయ అధికారులు శుక్రవారం పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి కె.హెబ్సీబారాణి మాట్లాడుతూ కోసూరువారిపాలెం, ఉత్తరచిరువోలులంక గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మినుము పంటలో అక్కడక్కడ పలాకు తెగులు వ్యాపించినట్లు గుర్తించామని, వ్యవసాయ అధికారులను సంప్రదించి పిచికారి చేసి పంటలను కాపాడుకోవాలని రైతులకు సూచించారు.

ఒకే ఇంటికి.. నాలుగు పన్నులు!

- సచివాలయం వద్ద బాధితుడి ధర్నా
- అడ్మిన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్



బందరులో 2వ డివిజన్ సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న బాధితుడు సాంబశివరావు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రెండో డివిజన్‌లో ఒకే ఇంటికి నాలుగు ఇంటి పన్నులు వేసి వాటిని చెల్లించాలని సచివాలయం అడ్మిన్ ఆదిత్య ఇబ్బంది పెడుతున్నాడంటూ స్థానిక బాధితుడు ఏవీవీ సాంబశివరావు శుక్రవారం సచివాలయ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రెండో డివిజన్ మాచవరంలో 15/216-2 డోర్ నంబర్‌లోని గృహంలో తమ కుటుంబం నివసిస్తోందని తెలిపారు. అయితే సచివాలయ అడ్మిన్ ఆదిత్య నాలుగు ఇంటి పన్నులు వేశాడని ఆయన ఆరోపించారు. తనకు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండానే ఇంటి పన్నులు చెల్లించకుంటే కుళాయి కనెక్షన్ తొలగిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆయన పేర్కొన్నారు. తన ఇంటికి ఒక్కటే పన్ను వేయాలని, నాలుగు ఇంటి పన్నులు వేయటంతో పాటు తనను మానసికంగా ఇబ్బంది పెడుతున్న అడ్మిన్ ఆదిత్యపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా సాంబశివరావు చెప్పేది అవాస్తవమని నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారి సమ్మెట వెంకటేష్ 'సాక్షి'కి తెలిపారు. సాంబశివరావు 11 ఏళ్లగా తాగునీటి కుళాయి పన్ను చెల్లించడం లేదన్నారు. రూ. 17,400 మేర కుళాయి పన్ను చెల్లించాల్సి ఉందన్నారు. గతంలో విద్యుత్ మీటర్ల కోసం సాంబశివరావు నాలుగు ఇంటి పన్నులు వేయించుకున్నారని, వీటిని ప్రస్తుతం అతని పేరుపై, అతని భార్య పేరుపై రెండు ఇంటి పన్నులు మాత్రమే ఉన్నాయని, సాంబశివరావు చెప్పినట్లుగా నాలుగు పన్నులు లేవన్నారు. కుళాయి పన్ను చెల్లిస్తే సరిపోతుందని అతను దాన్ని కట్టకుండా ఉండటానికి పై విధంగా అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నాడని వెంకటేష్ తెలిపారు.

జీతాలు ఇవ్వాలని వినతి

మచిలీపట్నంటౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.షర్మిష్ఠ.. నెలలో మూడో శుక్రవారం కావడంతో సిబ్బంది సమస్యలపై వినతులు స్వీకరించారు. తన కార్యాలయంలోని చాంబర్‌లో ఆరు వినతులు ఆమెకు అందాయి. తమకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని పలువురు ఉద్యోగులు ఆమెకు విజ్ఞప్తి చేశారు.

పచ్చదనం కరువు..

- పార్కుల్లో చెట్లు నరికివేత
- నాడు అభివృద్ధి..నేడు నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



13వ డివిజన్‌లో పార్కు ప్రధాన ద్వారం వద్ద ప్రస్తుతం గ్రీనరీని తొలగించిన దృశ్యం



13వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ హయాంలో గ్రీనరీతో ఉన్న పార్కు ప్రధాన ద్వారం(ఫైల్)



ప్రస్తుతం గ్రీనరీ లేక కళావిహీనంగా కనిపిస్తున్న పార్కు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పార్కుల్లో పచ్చదనం కరువైంది. ఉద్యానవనాల అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నగరంలో దాదాపు 100కు పైగా చిన్నా, పెద్ద మున్సిపల్ పార్కులు ఉన్నా వాటి అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. పార్కుల్లో పచ్చదనాన్ని నిర్వీర్యం చేసేలా పాలకుల తీరుంది. దీంతోపార్కులు ఎండిపోయి పచ్చదనానికి ఆమడ దూరంగా ఉన్నాయి.

సమస్య జటిలం

పార్కుల అభివృద్ధి, సంరక్షణ బాధ్యతలను నగర పాలక సంస్థ అధికారులు, పాలకులు విస్మరించటంతో సమస్య జటిలమవుతోంది. ఉదాహరణకు నగరంలోని 13వ డివిజన్ హిందు కళాశాల వెనుక ఉన్న మున్సిపల్ పార్కును గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేశారు. పార్కులో గ్రీనరీతో పాటు పిల్లల ఆట వస్తువులను, సేద దీరేందుకు సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. పార్కు బయట ప్రహరీ వెంట పచ్చదనంతో పాటు నీడను ఇచ్చే మొక్కలను పెంచారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అధికారులు, పాలకుల దుశ్చర్య కారణంగా మొక్కలను తొలగించారు. వాటి ట్రీ గార్డులను సైతం ధ్వంసం చేశారు. ఈ పార్కు నిర్లక్ష్యానికి గురైబోసి పోయి కనిపిస్తోంది.

నిర్వహణ గాలికి..

ఈ పార్కు నిర్వహణను గాలికి వదిలేశారు. ఉద్యానవనం గేటు సైతం తీసి ఉండటంతో పశువులు లోపలకు వెళ్లి అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. అయినా అధికారులకు పట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పార్కు తీరు కేవలం ఉదాహరణే. నగరంలోని మరిన్ని పార్కుల పరిస్థితి ఇలాగే ఉందని ప్రజలు వాపోతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యానవనాలను లక్షలాది రూపాయలతో అభివృద్ధి చేసి ప్రజల ఆహ్లాదానికి కృషి చేశారు. నేటి పాలకులు వీటిని నాశనం చేస్తూ తమకు ఆహ్లాదాన్ని దూరం చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాలకు టెండర్ల ఖరారు



మోపిదేవిలో టెండర్లు ఖరారు చేస్తున్న ఆలయ ఉప కమిషనర్ శ్రీరామవరప్రసాదరావు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వివిధ ఐటమ్స్‌కు సీల్డ్ టెండర్ల ద్వారా లైసెన్స్ హక్కును ఖరారు చేసినట్లుగా ఆలయ ఉపకమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన టెండర్లలో ఫిబ్రవరి 2 నుంచి 6వ తేదీ వరకు వివిధ ఐటమ్స్‌పై లైసెన్స్ పొందిన వారి వివరాలను ఆయన వివరించారు. చాందినీ పండాల్స్ వేయడానికి మచిలీపట్నం వాస్తవ్యులు సీహెచ్ తిరుమల లైసెన్స్ పొందినట్లు తెలిపారు. దేవాలయ ప్రాంగణం, స్టేజీ మండపాలు, ఈవెంట్స్ డెకరేషన్ చేయడానికి, బారిగేడ్లు ఏర్పాటుకు పెదకళ్లేపల్లి వాస్తవ్యులు నరేష్‌బాబు లైసెన్స్ పొందినట్లు, దేవాలయ ప్రాంగణం, స్టేజీ మండపంలో పచ్చి పూల అలంకరణకు చల్లపల్లి వాస్తవ్యులు యూవీ అమలేశ్వరావు, విద్యుత్ దీపాలంకరణకు నాగాయితిప్ప వాస్తవ్యులు సీహెచ్ రాజశేఖర్ లైసెన్స్ పొందినట్లు తెలిపారు. ఐరన్ వాటర్ ప్రూఫ్ పండాల్స్ వేయడానికి ఎవరూ ముందుకు రాక వాయిదా వేశామని వివరించారు. ఆలయ అధికారులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

వీఏఏపై వచ్చిన ఆరోపణలపై విచారణ



ఈ క్రాప్ నమోదుపై తెలుగురావుపాలెం ఆర్‌ఎస్‌కే వద్ద విచారణ చేస్తున్న ఏడీఏ శ్యామల

తెలుగురావుపాలెం(ఘంటసాల): ఈ క్రాప్ నమోదు చేయక నష్టపోయామంటూ అచ్చెంపాలెం రైతులు ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం వ్యవసాయ శాఖాధికారులు విచారణ చేశారు. ఘంటసాల మండలం తెలుగురావుపాలెం రైతు సేవా కేంద్రంలో ఇన్‌చార్జి వ్యవసాయ సహాయకుడిగా పని చేస్తున్న రవి చంద్ర అచ్చెంపాలెం గ్రామంలో ఈ క్రాప్ సక్రమంగా చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రెడ్రౌతు రాంబాబు, ఇతర రైతులు కలెక్టర్‌తో పాటు, మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల ఆధ్వర్యాన తెలుగురావుపాలెం ఆర్‌ఎస్‌కే వద్ద ఆయా రైతుల సమక్షంలో విచారణ చేశారు. ఈ సందర్భంగా ఈ క్రాప్ నమోదులో వీఏఏ నిర్లక్ష్యం వహించారని, దీంతో ధాన్యం అమ్ముకోవడంలో తీవ్రంగా నష్టపోయామని అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి రెగ్యులర్ వీఏఏను నియమించాలని సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు ఏడీఏకు వినతిపత్రం అందించారు. ఆయా సమస్యలు, రైతుల వివరాలను నమోదు చేసుకున్నామని, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఏడీఏ శ్యామల తెలిపారు. కార్యక్రమంలో తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీ కృష్ణ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మళ్లీ సంక్రాంతికి వస్తాం..



సంక్రాంతి పండుగ ముగియడంతో నగర ప్రజలను అలరించిన గంగిరెద్దులు శుక్రవారం సొంత ఊళ్లకు పయనమయ్యాయి. గంగిరెద్దుల నిర్వాహకులు డిసెంబర్ చివరి వారంలో బాపులపాడు మండలం రేమల్లె గ్రామం నుంచి నగర శివారులోని రాజుపేటకు వాటిని వ్యాన్‌లలో తరలించారు. సంక్రాంతి పండుగ ముగిసేవరకూ నగరంలోని పలు ప్రాంతాల్లో గంగిరెద్దులు విన్యాసాలతో ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సంప్రదాయంలో గంగిరెద్దులకు ప్రత్యేక ప్రాధాన్యముంది. నిర్వాహకులు నెల రోజుల పాటు నగరంలో గంగిరెద్దులతో సందడి చేయించారు. ఇక పండుగ ముగియడంతో సొంతూర్లకు బయలుదేరాయి.

- మచిలీపట్నంటౌన్

కృష్ణదేవరాయలకు తెలుగుపై మక్కువ



శ్రీకాకుళంలో రాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: కళాపోషకుడు కృష్ణదేవరాయలు అని అతిథులు కొనియాడారు. ఆంధ్రభోజ శ్రీకృష్ణదేవరాయలు 554వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం గొడుగుపేటలోని వెంకటేశ్వర కాంప్లెక్స్‌లో నేతాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాయలు దేశంలో పటిష్టమైన రాజ్యపాలన చేయటమే కాకుండా తన ఆస్థానంలో అష్టదిగ్గజ కవులు, కళలను పోషించి కవితా, కళాప్రేమను చాటుకున్నారన్నారు. కవిగా ఆముక్తమాల్యద, భువన విజయం గ్రంథ రచనలు చేసి తెలుగు భాషపై మక్కువను వ్యక్తం చేశారన్నారు. అనేక దేవాలయాలను కట్టించాడన్నారు. కార్యక్రమంలో నేతాజీ మిత్ర మండలి కన్వీనర్ ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, కూనపరెడ్డి బ్రహ్మయ్య, సూరిశెట్టి హరికృష్ణ, విన్నకోట సుబ్బారావు, సుబ్బారావు, మడమల రాంబాబు భాగవతార్ పాల్గొన్నారు.

ఘంటసాలలో..

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకృష్ణ దేవరాయల వైభవాన్ని యాదవులంతా విస్తృత ప్రచారం చేయాలని అఖిల భారత యాదవ మహాసంఘం పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ గొరిపర్తి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శ్రీకాకుళం గ్రామంలోని శ్రీకాకుళేశ్వర స్వామి (ఆంధ్ర మహావిష్ణువు) దేవాలయ ప్రాంగణంలోని ఆముక్త మాల్యద మండపంలో శ్రీకృష్ణ దేవరాయలు 554వ జయంతి వేడుకలు యాదవ మహా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండపంలోని శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్‌తో కలసి శ్రీనివాస్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వీర్ల వెంకట సత్యనారాయణ (నాని) యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విఘ్నేష్ యాదవ్, హీరేంద్ర యాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళేశ్వరస్వామి దేవస్థానంలో రాయల విగ్రహానికి ఒక్క దండ కూడా వేయకపోవడంపై అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఎదురుమొండి- గొల్లమంద రహదారికి నిధుల మంజూరు

అవనిగడ్డ: ఎదురుమొండి-గొల్లమంద రహదారికి రూ.13.45 కోట్ల నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కృష్ణానదికి వచ్చిన వరదలకు గొల్లమంద రహదారి కోతకు గురైందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా ఆసియా ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ బ్యాంకు నుంచి మంజూరు చేసినట్టు పేర్కొన్నారు.

ఎక్సైజ్ దాడులు

గూడూరు: పిండివారిపాలెంలో శుక్రవారం మచిలీపట్నం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యాన నిర్వహించిన తనిఖీల్లో ఓలేటి సోవమ్మ అనే మహిళ వద్ద 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు.